క్లుప్తంగా

పీ-4 కార్యక్రమంపై శిక్షణ


ఆచంట ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: సమాజంలో పేదరికం లేకుండా పేద కుటుంబాలను, బంగారు కుటుంబాలుగా మార్చడడానికి పీ-4 సర్వే ఉపకరిస్తుందని ఆచంట ఎంపీడీఓ బి.కృష్ణమోహన్ అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో పీ-4 నీడ్ అసిస్మెంట్ సర్వేపై శిక్షణ నిర్వహించారు. తాగునీరు, గ్యాస్, విద్యుత్, సంపాదన బ్యాంక్ ఖాతాలు లేనివారు బంగారు కుటుంబాలుగా అర్హత ఉంటుందన్నారు. వీరి వివరాలు ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి దుర్గా ప్రసాద్, సిబ్బంది భాగ్యశ్రీ, దీపిక, శ్వేత, మల్లిక, వరప్రసాద్ పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి


ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏఓ ప్రసాద్

భీమవరం అర్బన్: వరి నాట్లు పూర్తయిన రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి యర్రంశెట్టి ప్రసాద్ రైతులకు సూచించారు. భీమవరం మండలంలోని యనమదుర్రు గ్రామంలో బుధవారం ఈ-క్రాప్ నమోదును ఏఓ ప్రసాద్ పరిశీలించారు. ఈ-క్రాప్ నమోదులో రైతులు తమ పంట రకం, రైతు వివరాలతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఇలా చేయడం ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు పంట నష్ట పరిహారం, మద్దతు ధరకే ధాన్యం విక్రయించుకోవడానికి, ఇతర ప్రభుత్వ పథకాలు లబ్ధి పొందడానికి ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని రైతులకు సూచించారు. మండల వ్యవసాయాధికారి యర్రంశెట్టి ప్రసాద్, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్‌పై విద్యార్థులకు అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రసాద్

భీమవరం (ప్రకాశంచౌక్): విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలను నడపాలని ట్రాఫిక్ సీఐ వి.శ్రీనివాసరావు సూచించారు. తిరుమల విద్యా సంస్థల్లో బుధవారం ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెహికల్ ఇన్‌స్పెక్టర్ కేఎస్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు వాహనాలు నడిపేందుకు విధిగా లైసెన్సులు పొందాలన్నారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ, అతివేగంగా వాహనాలను నడపకూడదన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట తప్పనిసరిగా ధరించాలన్నారు. విద్యా సంస్థల వాహన డ్రైవర్లకు బ్రీత్ అనలైజర్ టెస్టు చేశాక వాహనం నడపాలని సూచించారు. ఆర్టీఓ అధికారులు ఏఎస్‌పీ తేజ, కళాశాల డైరెక్టర్ పి.వర్మ, ఎస్.సాయిరాజు, శ్రీరంగ శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

గణనీయంగా తగ్గుతున్న పాడి పరిశ్రమ

ఉండి: రాష్ట్రంలో రానురాను పాడిపరిశ్రమ గణనీయంగా తగ్గిపోతుందని ప్రభుత్వం దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉండి లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ గాదిరాజు రంగరాజు, పెన్మత్స రంగప్రసాద్ అన్నారు. బుధవారం ఉండి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గోవులకు దాణా పెట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ గోమాతను పూజించడం ఎంత పుణ్యమో వాటికి దాణా పెట్టడం కూడా అంతే పుణ్యమన్నారు. కానీ గోవులను రోడ్డుపై వదిలిపెట్టడం చాలా విచారకరమన్నారు. రోడ్లపై వదిలే మూగజీవాల్లో అధికంగా గోమాతలు (ఆవులు) ఉండడం ఆలోచించాల్సిన విషయమన్నారు. పాడి రైతులు ఆవులు, పశువుల విషయంలో శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఆవులు, తదితర మూగ జీవాలకు దాత కాగిత మహంకాళి ఆధ్వర్యంలో దాణా అందజేశారు. కార్యక్రమంలో ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్ సత్తి బ్రహ్మారెడ్డి, క్లబ్ మార్కెటింగ్ చైర్మన్ గాదిరాజు వెంకటేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆకు కూరలతోనే పోషకాలు

పాలకోడేరు: పోషణ కార్యక్రమంలో భాగంగా మోగల్లు అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో కూరగాయలు పెంచి, గర్భిణులకు, బాలింతలకు పంపిణీ చేస్తున్నారు. ఆకు కూరలతోనే పోషకాహార లోపం సమస్య తీరుతుందని వారికి అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి మాట్లాడుతూ 2024-25 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించిందన్నారు. మొదటి ఫేజ్ పోషణ అంగన్‌వాడీ పథకంలో భాగంగా మండలంలో 12 అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపిక చేశారన్నారు. 2025-26 సంవత్సరానికి గాను రెండో ఫేజ్ కింద కొన్ని కేంద్రాలు ఎంపిక చేశారన్నారు.

ఓపెన్ ఎయిర్ థియేటర్ నిరుపయోగం

చివరి దశ పనులను నిలిపేసిన కూటమి సర్కార్


రూ 3.50 కోట్లతో 90 శాతం నిర్మాణం పూర్తిచేసుకున్న ఓపెన్ ఆడిటోరియం

నరసాపురం: నరసాపురం చుట్టుపక్కల ఇళ్లలో ఏదైనా ఫంక్షన్ చేసుకోవాలంటే బయట ప్రైవేట్ కల్యాణ మండపాల్లో లక్షల్లో ఖర్చు అవుతుంది. దీంతో మధ్య తరగతివారు పడే ఇబ్బందులు అంతా ఇంతా కాదు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ వచ్చాక, అప్పటి ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు కృషితో ఆ సమస్యకు, కష్టానికి చెక్ పడే విధంగా అడుగులు వేశారు. పట్టణంలోని నిరుపయోగంగా ఉన్న మునిసిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను ఓపెన్ ఆడిటోరియంగా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకున్నారు. ముదునూరి చర్యలతో నరసాపురంలో తక్కువ అద్దె ఖర్చుతో ఫంక్షన్ హాల్ అందుబాటులోకి రావడమే కాకుండా మున్సిపాలిటీకి కూడా ఆదాయం పెరుగుతుందని అంతా భావించారు. గత ప్రభుత్వం హయాంలో మున్సిపల్ ఓపెన్ ఎయిర్ థియేటర్ స్థానంలో రూ.3.50 కోట్లతో మున్సిపల్ ఓపెన్ ఆడిటోరియం నిర్మాణం ప్రారంభమైంది. పాత భవనాన్ని కూల్చేసి అక్కడ అధునాతన వసతులతో ఓపెన్ ఆడిటోరియం నిర్మాణం దాదాపు పూర్తిచేశారు. మరో 10 శాతం చిన్నపాటి పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. దాదాపు 90 శాతం పనులు పూర్తయ్యి, పనులు చివరిదశలో ఉండగా ప్రభుత్వం మారడంతో పనులు నిలిచిపోయాయి. ఈ పనులను కూటమి సర్కార్ అటకెక్కించింది. ఈ పనులు పూర్తయితే ఫంక్షన్స్ చేసుకోవడానికి అనువుగా ఉంటుంది.

అప్పుడు అంతే..ఇప్పుడూ అంతే

అందుబాటులో ఎంతో విలువైన స్థలం ఉన్నా కూడా, ఆదాయం పెంచుకునే మార్గంపై గతంలో టీడీపీ హయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి పెట్టలేదు. అందుబాటులో ఉన్న విలువైన ఖాళీ స్థలంలో ఓపెన్ ఆడిటోరియం నిర్మించడానికి చర్యలు తీసుకుంటే దానిని కూడా కొనసాగించలేక ఇప్పుడు కూటమి సర్కార్ గతంలో చేసిన తప్పే చేస్తుందని పట్టణవాసులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా కూటమి నాయకులు మున్సిపల్ ఓపెన్ ఆడిటోరియం పనులను పూర్తి చేయాలని కోరాతున్నారు.

వేతనాల పెంపుపై హర్షం

పాలకొల్లు సెంట్రల్: మునిసిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికులుగా పని చేస్తున్న తమకు ప్రభుత్వం వేతనాలు పెంచడం చాలా ఆనందంగా ఉందని పాలకొల్లు మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ బి.విజయసారధిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికులు గోపి, నాగు, అంజనేయులు, శివ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

కాళ్ల: ప్రభుత్వ అనుమతులు లేకుండా అనధికారంగా మద్యం అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆకివీడు ఎక్సైజ్ సీఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు.మండలంలోని కలవపూడి శివారు మోడి గ్రామంలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం దాడులు నిర్వహించారు. మద్యం అమ్ముతున్న గుడాల కాంతమ్మను అదుపులోకి తీసుకొని ఆమె వద్ద 6 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రైతులు బీమా పథకాన్ని వినియోగించుకోవాలి



నడిపూడిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

పెనుగొండ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం పెనుగొండ మండలం వడలి గ్రామంలో రైతు సేవా కేంద్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ పీఎం ఫసల్ బీమా పథకంపై వివరించారు. తుఫానులు, అకాల వర్షాలు, ప్రకృతి వైపరీత్యాలు కారణంగా పంట నష్టాలు జరిగిన రైతులను ఆదుకోవడం కోసం ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ బీమా కోసం రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. నమోదు ప్రక్రియపై సిబ్బందిని ఆరా తీశారు.

బంగారు కుటుంబాలకు అండగా నిలవాలి

సమాజంలో పేద బడుగు, బలహీన వర్గాల వారిని గుర్తించే పీ -4 సర్వేలోని బంగారు కుటుంబాలకు అండగా నిలవాడానికి మార్గదర్శకులు ముందుకు రావాలని జేసీ పిలుపునిచ్చారు. బుధవారం నడిపూడి సచివాలయం వద్ద పీ-4 గ్రామ సభలో పాల్గొన్నారు. గ్రామ సభ అనంతరం నడిపూడిలోని నిత్యావసరాల పంపిణీ దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎలాంటి అక్రమాలకు తావివ్వకుండా పంపిణీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఎం.సునీల్ కుమార్, తహసీల్దార్ జి.అనితకుమారి, మండల వ్యవసాయ శాఖ అధికారి పి.స్పందన, సర్పంచ్ కడలి బేబీ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

మిథున్‌రెడ్డి అరెస్ట్ కక్షపూరితం


వీరన్న

నరసాపురం రూరల్: వైఎస్సార్ సీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అరెస్టు కక్షపూరితమని, కూటమి ప్రభుత్వ అన్యాయాలను, అక్రమాలను నిలదీస్తున్నందునే అక్రమ కేసుల్లో ఇరికించి జైలుకు పంపారని వైఎస్సార్ సీపీ సంచారజాతుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పెండ్ర వీరన్న తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అక్రమాలను అడ్డుకోవడం మిథున్‌రెడ్డి, మాజీ మంత్రి రామచంద్రరెడ్డిలకు కొత్తకాదని పేర్కొన్నారు. మూడుసార్లు ఎంపీగా గెలిచి ప్రజాసేవ చేస్తున్న మిథున్‌రెడ్డిని మద్యం కేసులో ఇరికించారని మండిపడ్డారు. ఈ బురదను జగన్‌మోహన్‌రెడ్డికి సైతం అంటగట్టే విధంగా కూటమి నేతలు అన్ని రకాల కుతంత్రాలు చేస్తున్నారని ఆరోపించారు. అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబునాయుడు, అతని కోటరీ ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కడం కొత్తేమీ కాదన్నారు. అధికారంలోకి వచ్చేందుకు కూటమి నాయకులు ఇచ్చిన హామీల అమలు గురించి ఇటీవల టీడీపీ నిర్వహించిన ముందడుగు కార్యక్రమంలో అధిక సంఖ్యలో ప్రజలు హామీలు అమలు చేయాలని నిలదీస్తుండటంతో ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇలాంటి ఎత్తులు వేస్తున్నారని వీరన్న విమర్శించారు.

ఘనంగా కోడి రామకృష్ణ జయంతి


కోడి రామకృష్ణకు నివాళులర్పిస్తున్న కళాపరిషత్ సభ్యులు


పాలకొల్లు సెంట్రల్: క్షీరపురి వైభవాన్ని ప్రపంచం నలుదిశలా వ్యాపింపజేసి ఎంతో కీర్తి తీసుకువచ్చిన కోడి రామకృష్ణ కృషి మరువలేనిదని పాలకొల్లు కళాపరిషత్ అధ్యక్షుడు కేవీ కృష్ణవర్మ అన్నారు. బుధవారం స్థానిక మారుతి థియేటర్‌లో పాలకొల్లు కళాపరిషత్ ఆధ్వర్యంలో కోడి రామకృష్ణ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణవర్మ మాట్లాడుతూ వందకుపైగా చిత్రాలకు దర్శకత్వం వహించిన కోడి రామకృష్ణ ఎంతో మంది నూతన కళాకారులను చిత్రసీమకు పరిచయం చేసి తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని ఏర్పాటు చేసుకున్నారన్నారు. పట్టణంలో లలిత కళాంజలి నాటక అకాడమి ఏర్పాటు చేసి నాటిక పోటీలు నిర్వహించారన్నారు. ఆయన స్ఫూర్తితోనే గత 16 ఏళ్లుగా పట్టణంలో పాలకొల్లు కళాపరిషత్ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కళాపరిషత్ సభ్యులు మేడికొండ శ్రీనివాసరావు, మానాపురం సత్యనారాయణ, జక్కంపూడి కుమార్, కొల్లి కొండప్రసాద్, నీలంశెట్టి ప్రసాద్, వంగా నరసింహరావు, కొయ్యాన సూర్యనారాయణ, థియేటర్ మేనేజర్ దేవళ్ల బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

కొడమంచిలిలో 'పొలం పిలుస్తోంది'


'కొడమంచిలిలో పొలం పిలుస్తోంది'లో పాల్గొన్న రైతులు, అధికారులు

పెనుగొండ: సార్వా సాగు ప్రారంభమైన నేపథ్యంలో రైతులు అందరూ తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని ఆచంట మండల వ్యవసాయాధికారి బి.నాగరాజు కోరారు. బుధవారం ఆచంట, కొడమంచిలిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పంట ఊడ్చిన తేదీ, పంట రకం వంటి వివరాలు రైతు సేవా కేంద్రాల్లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. సార్వా నిమిత్తం ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనలో భాగంగా రైతులు తప్పని సరిగా ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాలన్నారు. బ్యాంకులో పంట రుణాలు తీసుకోని రైతులు రైతు సేవా కేంద్రాలకు వచ్చి ఆగస్టు 15వ తేదీ లోపు నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ గుబ్బల నరేష్ పాల్గొన్నారు.

ఏఆర్‌టీ సెంటర్ తనిఖీ


ఏఆర్‌టీ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ జి గీతాబాయి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ జి.గీతాబాయి అధ్యక్షతన జిల్లా ఏఆర్‌టీ సరోగసీ తనిఖీల కమిటీ, శ్రీఎస్‌వీఆర్ మెటర్నిటీ ఆసుపత్రి ప్రారంభించనున్న ఏఆర్‌టీ మొదటి స్థాయి ఆసుపత్రి అనుమతులకు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ గీతాబాయి సంబంధిత కమిటీ ఏఆర్‌టీ క్లినిక్ నిర్వహణకు ఏర్పాటు చేసిన పలు విభాగాలు పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి గర్భిణులకు స్కానింగ్ నిర్వహణ, అనుమతులు తదితర అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో గైనకాలజిస్ట్ డాక్టర్ మాధురి, రేడియాలజిస్ట్ డాక్టర్ జీఎల్ఎస్ బాపిరాజు, పేథాలజిస్ట్ డాక్టర్ సాయికిరణ్మయి, రెడ్‌క్రాస్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఎంఎస్‌వీఎస్ బద్రిరాజు, లీగల్ సెల్ మోనిటరింగ్ కన్సల్‌టెంట్ వి.సత్య రవి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్‌పై అవగాహన సదస్సు


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ కాళీచరణ్

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం జేపీ రోడ్‌లోని శ్రీఆదిత్య డిగ్రీ కళాశాలలో సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారని కళాశాల డైరెక్టర్ ఎం.శ్రీనివాస్ తెలిపారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన భీమవరం టూ టౌన్ సీఐ జి.కాళీచరణ్ మాట్లాడుతూ చాలా మంది సైబర్ నేరగాళ్ల వలలో పడుతున్నారని, అవి మనం ఎదుర్కోవడం ద్వారా వాళ్ల ఆటలు కట్టిపెట్టొచ్చని అన్నారు. పలు మాధ్యమాల్లో వచ్చే వాటిని క్షుణ్ణంగా తెలుసుకొని దాని ద్వారా మనం చర్యలు కొనసాగించాలని తెలిపారు. అనంతరం ప్రిన్సిపాల్ ఎ.అనురాధ జి.కాళీచరణ్‌ను సత్కరించారు. కార్యక్రమములో భాగంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎ.అనురాధ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మావుళ్ల, ప్రోగ్రాం ఆఫీసర్ బ్రహ్మం, కళాశాల ఏఓ జయ్‌కుమార్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఓ బిన్నిబాబు

వీరవాసరం: వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించి, అధిక దిగుబడులు సాధ్యమవుతాయని మండల వ్యవసాయ అధికారి బిన్నిబాబు తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం బలుసులగొయ్యిపాలెం, పంజా వేమవరం గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ రుణం తీసుకోని రైతులు తక్షణమే ఎకరాకు 210 రూపాయలు చెల్లించి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో నమోదు కావాలని తెలిపారు. వరి సాగులో తీసుకోవలసిన జాగ్రత్తలపై రైతులకు ప్రత్యేక అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ సతీష్, వీఏఏ దివ్య, తమ్మినేని నాగేశ్వరరావు, వీరవల్లి గణేష్, దానేశ్వరరావు, దంపన బోయిన రామాంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ


యలమంచిలి: మేడపాడు శివాలయంలో శాకంబరిగా పార్వతీదేవి


పెనుగొండ: దొంగరావిపాలెంలో శాకంబరిగా కొండాలమ్మ

యలమంచిలి: మండలంలోని మేడపాడు గ్రామంలోని ఉమారామలింగేశ్వరస్వామిలను బుధవారం శాకాంబరి దేవిగా అలంకరించారు. మాస శివరాత్రి, ఆరుద్ర నక్షత్రం, ఆషాఢ మాసం చివరి రోజు సందర్భంగా దేవేరులను సుమారు 200 కిలోలు కాయగూరలతో ఆలయ అర్చకులు బాదంపూడి చిరంజీవి శర్మ, బాదంపూడి సత్యనారాయణమూర్తి అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి

నరసాపురంలో..

నరసాపురం రూరల్ మండలంలోని యర్రంశెట్టివారిపాలెం గ్రామం అరవ ఆకనవారి మెరకలో ఉన్న గ్రామదేవతలైన శ్రీమర్లమ్మ, పసలదీవిలో ఉన్న కనకదుర్గమ్మ అమ్మవార్లను బుధవారం శాకంబరీ దేవిగా అలంకరించారు. కూరగాయలు, ఆకుకూరలు తదితర వాటితో అమ్మవారిని అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆయా గ్రామాల్లోని ప్రధాన రహదారుల మీదుగా అమ్మవారికి సారె సమర్పించేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఊరేగింపుగా ఆలయానికి బయలుదేరారు.

పెనుగొండలో..

పెనుగొండ: ఆషాఢ మాసం సందర్భంగా దొంగరావిపాలెం కూరగాయల మార్కెట్ వద్ద శ్రీ కొండాలమ్మ అమ్మవారిని బుధవారం శాకంబరి అమ్మవారిగా అలంకరించారు. ఆలయ అర్చకులు సత్యనారాయణ శర్మ అమ్మవారిని దొంగరావిపాలెం శ్రీ వెంకటేశ్వర కూరగాయల వర్తక సంఘం ఏర్పాటు చేసిన వివిధ రకాల కూరగాయలు, పండ్లతో అమ్మవారిని అలంకరించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు మహిళా భక్తుల అధిక సంఖ్యలో పాల్గొని ప్రసాదాలను స్వీకరించారు.

మావుళ్లమ్మకు సారే సమర్పణ

సిద్ధాంతం గ్రామ దేవత మావుళ్లమ్మకు చౌదరీస్ సంఘం ఆధ్వర్యంలో మహిళలు ఆషాఢ సారె సమర్పించారు. బుధవారం ఉదయం చౌదరీస్ రామాలయం నుంచి స్వీట్లు, పసుపు, కుంకుమ, చీర, రవికెతో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పూజలు, అర్చనలు నిర్వహించారు.


పెనుగొండ: సిద్ధాంతంలో మావుళ్లమ్మకు సారె తీసుకెళ్తున్న మహిళలు


నరసాపురం రూరల్: శాకంబరిగా దర్శనమిస్తున్న మర్లమ్మను దర్శించుకుంటున్న భక్తులు

తూతూమంత్రంగా పాలిథిన్ కవర్ల నిషేధం


మూలలంక బోదెలో పేరుకుపోయిన పాలిథిన్ వ్యర్థాలు

ఆకివీడు: పాలిథిన్ కవర్ల వాడకం స్థానిక నగర పంచాయతీలో యథేచ్ఛగా కొనసాగుతోంది. ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, ఇతర ప్లాస్టిక్ వస్తువుల విక్రయాలు కొనసాగుతున్నాయి. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ ఆదేశించినా సంబంధిత అధికారులు సరైన చర్యలు తీసుకోకపోవడంతో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. పంట కాలువలు, మురుగు బోదెలు ప్లాస్టిక్ వస్తువులు, కవర్లతో నిండిపోతున్నాయి. నగర పంచాయతీ పరిధిలోని పలు చోట్ల రోడ్ల వెంబడి ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. శానిటరీ సిబ్బంది ఇంటింటికీ వచ్చి చెత్తను సేకరిస్తున్నా, ప్లాస్టిక్ కవర్లు రోడ్ల పైనే తచ్చాడుతున్నాయి. గాలికి డ్రెయిన్లు, కాలువల్లోకి ఖాళీ ప్రదేశాల్లోకి చేరుకుంటున్నాయి. కూరగాయలు, పండ్ల దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లు యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. కాఫీ హోటళ్లలోనూ, టీ స్టాళ్లలో ప్లాస్టిక్ గ్లాసుల వినియోగం కొనసాగుతోంది. నగర పంచాయతీ అధికారులు మొక్కుబడిగా ప్లాస్టిక్ వినియోగం అరికట్టే చర్యలు చేపట్టారని విమర్శలు వినపడుతున్నాయి. ఉన్నతాధికారులు హెచ్చరించినప్పుడు ప్రజల్లో అవగాహన కోసం ఫ్లెక్సీలతో ర్యాలీలు నిర్వహించినట్లుగా ఫోటోలు దిగుతున్నారని, ప్లాస్టిక్ వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

నరసాపురం: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం గురువారం ఉదయం 11 గంటలు నుంచి 12 గంటలు వరకూ డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నరసాపురం ఆర్టీసీ డీఎం ఎస్ సుబ్బన్నరెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఆర్టీసీ కార్గో సేవలు, ప్రత్యేక బస్సులు, విహారయాత్రలు, శుభకార్యాలకు బస్సుల ఏర్పాటు తదితర అంశాలపై ఫిర్యాదులు, సూచనలు తెలపాలని కోరారు. తమ సమస్యలను 99592 25486 నంబర్‌కు నిర్ణీత సమయంలో ఫోన్ చేసి తెలపాలని సూచించారు.

ఉన్నత లక్ష్యాలతో ముందడుగు వేయాలి

నరసాపురం: ఎంచుకున్న రంగాల్లో రాణించే విధంగా విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందడుగు వేయాలని నరసాపురం ఆర్డీఓ దాసి రాజు సూచించారు. వైఎన్ కళాశాల హెచ్‌ఆర్డీ సెంటర్‌లో బుధవారం ఉద్యోగ దిక్సూచి మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ కెరీర్ సర్వీస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాబ్ మేళాను ఆర్డీఓ ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుతం అనేక రంగాల్లో ఉద్యోగ అవకాశాలు విస్తృతంగా పెరిగాయన్నారు. అందుబాటులో ఉన్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. 15 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 250 మంది నిరుద్యోగులు ఇంటర్వ్యూల్లో పాల్గొన్నారు. వారిలో 146 మందిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో వైఎన్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ అందే రామసతీష్, ప్రిన్సిపాల్ సీహెచ్ కనకారావు, డీన్ గంధం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎన్‌ఎల్‌ఎం బృందం పర్యటన

ఆకివీడు: మండలంలో ఈ నెల 24వ తేదీ నుంచి ఆగస్టు 2వ తేదీ వరకూ ఎన్‌ఎల్‌ఎం బృందం పర్యటిస్తుందని ఎంపీడీఓ మార్కండేయేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నోడల్ బృందానికి సంబంధిత మండల స్థాయి అధికారులు రికార్డులతో సహకరించాలన్నారు. ఎన్‌ఎల్‌ఎం బృందం ఉపాధి హామీ పనులు, జాబ్‌కార్డు ఉన్న 10 మందితో మాట్లాడటం, వారంలో ఒక రోజు పని వివరాలు అడుగుతారని తెలిపారు. ఆడిట్ రిపోర్టులు తనిఖీ చేస్తారన్నారు. 3 సంవత్సరాల్లో జరిగిన 15 పనులను పరిశీలిస్తారని చెప్పారు. మండలంలోని రాజులపేట, అప్పారావుపేట, దుంపగడప, సిద్ధాపురం, చినమిల్లిపాడు, కుప్పనపూడి గ్రామాలను సందర్శిస్తారని ఎంపీడీఓ తెలిపారు.